క్లుప్తంగా

జీవిత పరమార్థాన్ని తెలిపేదే భగవద్గీత

జమ్మలమడుగు : మనిషి జీవిత పరమార్థాన్ని వివరించేది భగవద్గీత అని చిన్మయ మిషన్ బ్రహ్మచారిణి రచనా చైతన్య అన్నారు. మంగళవారం పట్టణంలోని బెల్లంకొండు సీతారామ కల్యాణ మండపంలో ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీతలోని 12వ అధ్యాయంలోని భక్తియోగంలోని పలు అంశాలను వివరించారు. ప్రజలకు ధైర్యాన్ని విలువల గురించి వివరించేది భగవద్గీత అన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తొండూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మంగళవారం ఆయన తెలుపుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదిక పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : కానిస్టేబుల్ ఉద్యోగాలకు బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే నమూనా పరీక్షలను అభ్యర్థులు ఉపయోగించుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పరీక్షలను కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్పీ డిగ్రీ కాలేజీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు వంద రూపాయల ఎంట్రీఫీజు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న నిందితుడి అరెస్ట్ చేసిన రిమ్స్ పీఎస్ ఎస్ఐ నారాయణ

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రామాంజనేయపురం సమీపంలో సుమోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం బస్తాలను ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ సంఘటనలో ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాషాను అరెస్ట్ చేయడంతో పాటు 1618 కిలోల బరువున్న 34 బస్తాల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.

ముఖ గుర్తింపు హాజరు ప్రారంభం

సింహాద్రిపురం : ప్రభుత్వ అధికారులు ప్రజలకు నిర్ణీత సమయాలలో అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి సమయం వృథా కాకుండా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అధికారులకు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టింది. మంగళవారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు సచివాలయాలలో కూడా సంబంధిత అధికారుల ముఖ గుర్తింపు హాజరును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5.30గంటలకు ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి, సచివాలయ సిబ్బంది తప్పకుండా ముఖ గుర్తింపు హాజరు వేయాల్సి ఉంటుందన్నారు. నేటి నుంచి సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ పరిధిలోని 20 నుంచి 40 ఇళ్ల వరకు ప్రజల అర్జీలు స్వీకరించి అక్కడే సమస్యలను పరిష్కరించాలని.. పరిష్కరించలేని అర్జీలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్జీ సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : పంటకు ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతు ఆర్బీకేలలో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం లింగాల గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, ఈ సీజన్‌లో పంట సాగు చేసి పంట నమోదు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే ఆయా ఆర్బీకేల సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాడు - నేడుతో పాఠశాల అభివృద్ధి



నాడు అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల



నేడు అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పులివెందుల రూరల్ : పేద ప్రజలకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా పులివెందుల పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపం అహోబిలాపురంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సుమారు రూ.14 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ పాఠశాలను గతనెల 25వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

ఆదాయం పెంచుకోవడానికే ప్రజాభిప్రాయ సేకరణ

ఏపీఎస్పీడీసీఎల్ డీఈ నాయక్



పులివెందుల రూరల్ : 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన వార్షిక ఆదాయం అవసరాలు, రిటైల్ ధరలపై ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ విశాఖ పట్టణం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విద్యుత్ బిల్లుల విషయంలోనూ, ఆదాయం పెంచుకోవడానికి ఏవైనా సమస్యలుంటే మూడు రోజుల పాటు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని మండలి చైర్మన్‌తో మాట్లాడవచ్చునన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీ ఏరువాక గంగమ్మతల్లి జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన శ్రీ ఏరువాక గంగమ్మ తల్లి జాతర (ఆవుల పబ్బం) మహోత్సవం మార్చి 29వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 29వ తేదీన బొల్లేపు పూజలు గ్రామ ప్రవేశం, పొలేటి గంగకు బోనము, 30వ తేదీన శమీవృక్ష యాగం మార్కెట్ యార్డు నందు జరుగుతుందన్నారు. 31వ తేదీన అమ్మవారి ఊరేగింపు, ఏప్రిల్ 1వ తేదీన పుట్టబంగారం తెచ్చు కార్యక్రమం, గంగ కాటమరాజు కథ, 2వ తేదీన అమ్మవారికి బోనాలు, 3వ తేదీన అమ్మవారి దీవెన బండారు ఇచ్చు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అభినందనీయం



క్రీడాకారులకు నగదు బహుమతిని అందిస్తున్న సీఐ గోవిందురెడ్డి

వేముల : గ్రామీణ ప్రాంతంలో నిర్వహించే క్రీడలకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని ఆర్‌కే వ్యాలీ రూరల్ సీఐ గోవిందురెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వేములలో మూడు రోజులపాటు తాలుకాస్థాయిలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్లకు మంగళవారం ఆయన నగదు బహుమతులను అందజేసి మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా క్రీడాకారులుగా ఎదగవచ్చునన్నారు. ఇందుకోసం క్రీడల నిర్వహణ కోసం అయ్యే ఖర్చులను, బహుమతులను దాతల ద్వారా గెలుపొందిన జట్లకు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌లో విన్నర్‌గా నిలిచిన వేముల జట్టుకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి రూ.30వేలు.. రన్నర్ జట్టుకు నిలిచిన జట్టుకు పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి రూ.20వేలు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి రూ.20వేలు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, రాఘవరెడ్డిలు చెరో రూ.10వేలను అందించారు. ఈ బహుమతులను ఆయా జట్లకు సీఐ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్‌రెడ్డి, బాలాజి మినరల్స్ యజమాని రమణ, నిర్వాహకులు బ్రహ్మానందరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆర్థిక స్తోమత పెంచాలన్నదే ఏపీజీబీ లక్ష్యం



పిక్స్‌డ్ డిపాజిట్ దారులకు బాండ్లను అందజేస్తున్న జగదీశ్వర్‌రావు

వీరపునాయునిపల్లె : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులోని ఖాతాదారులందరి ఆర్థిక స్తోమత పెంచుకోవాలన్నదే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లక్ష్యమని ఆ శాఖ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని బ్యాంకులో ఖాతా దారులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలని, ఖాతాదారులు తమ వద్ద ఉన్న మొత్తాన్ని డిపాజిట్ లేదా సేవింగ్ అకౌంటులో జమ చేసుకోవడం వలన అత్యవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. పిక్స్‌డ్ డిపాజిట్‌లపై అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అందించడంతో పాటు తక్కువ వడ్డీతో వివిధ రకాల రుణాలు అందిస్తామన్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రుణ సహాయాన్ని పెంచుకోవాలన్నారు. రీజనల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ రికరింగ్ డిపాజిట్ పథకంలో ప్రతి నెల 1350 రూపాయలు చెల్లించి 5 సంవత్సరాలకు లక్ష రూపాయలు పొందవచ్చన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ వీరపునాయునిపల్లె శాఖలో లాకర్, ఏటీఎం సౌకర్యం వెంటనే కల్పించాలని కోరారు. గతంలో ఉన్న బ్యాంకుకు సంబంధించిన భవనం సిథిలావస్తకు చేరుకోడవంతో ప్రస్తుతం ప్రైవేటు భవనంలో కొనసాగుతోందని తెలిపారు. అక్కడ నూతనం భవనం నిర్మించకపోతే కోట్ల రూపాయల విలువగల స్థలం ఆక్రమణలకు గురవుతోందన్నారు. దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్ ఇప్పటికే భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని నూతన భవనం నిర్మాణం పూర్తి కాగానే లాకర్, ఏటీఎం సౌకర్యాలను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిపాజిట్ దారులకు బాండు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కడప ప్రధాన కార్యాలయ సీనియర్ మేనేజర్ చిరంజీవి, స్థానిక బ్యాంకు మేనేజర్ రవికుమార్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించుకోండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : జగనన్న ఇళ్ల లబ్ధిదారులందరూ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మాలెపాడు గ్రామంలోని లబ్ధిదారులతో ఆయన సమావేశమై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కచ్చితంగా ఇళ్లను నిర్మించుకోవాలని, ప్రతి రోజు జిల్లా కలెక్టర్ సమీక్ష చేస్తున్నారని లబ్ధిదారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మాలెపాడు గ్రామంలో ఇళ్లులేని వారికి ఇళ్లు మంజూరయ్యాయని వారందరూ ఇళ్లను నిర్మించుకోవాలని ఆయన సూచించారు. ఇంటికి అదనంగా పొదుపు సంఘాల ద్వారా రూ.35 వేలు నగదును కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాకలో అన్నమాచార్య సంకీర్తనాలాపన



కీర్తనలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలోని అన్నమయ్య ధ్యాన మందిరంలో మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముందుగా అన్నమయ్య విగ్రహానికి పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన అన్నమాచార్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో సంకీర్తనలు చేపట్టారు. అన్నమయ్యను స్మరించుకుంటూ ప్రతి యేటా అన్నమయ్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సాయిలోకేష్, కంబాల శ్రీనివాసులు, సురేష్‌రాజు, షబ్బీర్ అహమ్మద్, గ్రామపెద్దలు అదృష్టదీపుడు, రమణయ్య పాల్గొన్నారు.

సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతపల్లి జాతీయ రహదారిపై వెలసిన సత్యమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువ జాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకొని మహిళలు అమ్మవారిని దర్శించుకొని కాయా, కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

పుల్లంపేట: దళవాయిపల్లె గ్రామంలోని అభయాంజనేయస్వామికి పూజారి చిన్నా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు వేకువ జాము నుంచి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పట్టణంలో రెండు రేషన్ షాపులు సీజ్

ప్రొద్దుటూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సాయంత్రం పలు రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు తూకాల్లో వ్యత్యాసాలు ఉండటంతో రెండు రేషన్ షాపులను సీజ్ చేశారు. రెండో వార్డు పరిధిలోని బోగాల నాగిరెడ్డి, మూడో వార్డు పరిధిలోని జంబాపురం అనూష డీల ర్లుగా ఉన్న రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తూకాల్లో వ్యత్యాసం ఉండటంతో షాపులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రెడ్డప్ప, ఐదురు బాషా తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన జువెనైల్ హోం, దిశ పోలీస్‌స్టేషన్, ఎస్ఎఫ్ఎస్ స్ట్రీట్, భగత్ సింగ్‌నగర్, రాజీవ్ మార్గ్, ఎన్జీఓ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జువైనల్ హోంలో ఫ్యాన్లు అన్నీ పనిచేసేలా చూసుకోవాలని, మరుగుదొడ్లలో ఎగ్జాస్టర్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు. పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దిశ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ఎస్ఎఫ్ఎస్ వీధిలో నిర్మిస్తున్న మురికి కాలువలను శుభ్రం శుభ్రం చేయాలన్నారు. భగత్ సింగ్ నగర్ వద్ద జరుగుతున్న పార్కు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్జీవో కాలనీ వద్ద నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలి

కడప నగరంలోని నిజాం నగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 3,11,14 డివిజన్లలో పర్యటించి పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికలను పరిశీలించారు. నిజాంనగర్లో బ్లాక్ అయిన మ్యాన్ హోళ్లను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. బహుజననగర్లో మెయిన్ రోడ్డులో వాటర్‌పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలన్నారు. ఆటోనగర్‌లో రోడ్లు, కాలువలు, కల్వర్టు నిర్మించడానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని, పిల్లలు నడవడానికి దారి ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న బోర్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

పంటకోత ప్రయోగంతో రైతులకు ఉపయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బద్వేలు ఏడీఏ

బద్వేలు అర్బన్ : పంటకోత ప్రయోగం చేయడం వలన రైతులు ముందస్తు దిగుబడిని తెలుసుకునే అవకాశం ఉంటుందని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు అన్నారు. మండలంలోని అనంతరాజుపురం సచివాలయం పరిధిలో గల దిగువ చెర్లోబోయినపల్లె గ్రామంలో శ్రీనివాస్ అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో 5x5 విస్తీర్ణంలో పంట కోయగా 13.820 కేజీల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటకోత ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

జేవీవీ చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి, జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను మంగళవారం కందుల గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 21, 22 తేదీల్లో కడప నగరంలో జరగనున్న చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల వివరాలను ఈ పోస్టర్‌లో ప్రచురించారు. ఈ సందర్భంగా చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచేందుకు జేవీవీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర రాహుల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించేందుకు జేవీవీ ఈ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తే సమాజంలో ఆలోచన పరులుగా సరైన జ్ఞానంతో పెరుగుతాయన్నారు. తమ సంస్థ ప్రతి ఏడాది చెకుముకి సైన్స్ ఫెస్టివల్ పేరిట మెగా సైన్స్ ఈవెంట్‌ను పాఠశాల, మండలం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తోందని, ఇందులో సైన్స్ జ్ఞానాన్ని పెంచేందుకు క్విజ్‌లు, పరీక్షలు, ప్రయోగాలుసహా అనేక వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కందుల రాజేశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు సరస్వతి, సునీత, కామేశ్వరమ్మ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రూ.కోటి 20 లక్షలు మంజూరు



టంగుటూరులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : టంగుటూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.కోటి 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి వెల్లడించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల వివరాల సంక్షేమ బావుటా బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రెండు నెలల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి వీధికి తాగునీటిని అందిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే రాచమల్లును పార్టీ నాయకుడు గౌతమ్‌రెడ్డి భారీ గజమాలను క్రేన్ సహాయంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, ముక్కమల్ల శివశంకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోనా వెంకట సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగేషరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణకు సహకరించండి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డికి మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మాదిగలకు ఇచ్చిన మాటను 8 ఏళ్లు గడిచినా నిలబెట్టుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుతో మాట్లాడి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని యల్లారెడ్డిని రారు. ఈ సమస్యపై స్పందించకపోతే ఈనెల 24వ తేదీ నుంచి రాష్ట్రంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా, నియోజకవర్గ నాయకుల ఇళ్లను మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఇ.శివశంకర్ మాదిగ, వై.వెంకటరమణ, దాసరి ఓబులేసు, గడ్డం నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, భద్రకాళి మాత



సిద్దారెడ్డిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాపాడు : సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని కనుమ పార్వేట రోజున అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో గ్రామోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె దేవళాలు వద్ద నుంచి మొదలైన గ్రామోత్సవం కేతవరం, నెర్రవాడ, బద్రిపల్లె, వీవీ కొట్టాలు, విశ్వనాథపురం, లక్ష్మీపేట, వీరభద్రాపురం, అల్లాడుపల్లె గ్రామాల మీదుగా జరిగి అనంతరం అల్లాడుపల్లె దేవళాలులోని వీరభద్రస్వామి సన్నిధిలో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో ఆయా గ్రామ ప్రజల బాణా సంచా కాల్చుతూ వాయిద్యాల నడుమ వీరభద్రస్వామి, భద్ర కాళిమాత ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు.

చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని చియ్యపాడు గ్రామంలో మొదలైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు సిద్దారెడ్డిపల్లె గ్రామానికి చేరుకుంది. ప్రాచీన కాలం నాటి చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద సంక్రాంతి, కనుమ, పార్వేట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నుంచి శ్రీదేవి భూదేవి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లింగాలదిన్నెపల్లెలో పార్వేట ఉత్సవం



బి.మఠం క్రాసింగ్ వద్ద పార్వేట ఉత్సవంలో భక్తులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదినెన్నపల్లెలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. రామాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగింపుగా బి.మఠం క్రాసింగ్ వరకు తీసుకెళ్లి పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం అందరిని ఆకట్టుకుంది.